## ఆలయానికి విరాళం



ఆలయంలో పెయింటింగ్‌ పనులను పరిశీలిస్తున్న నాయినేని చంద్రకాంత్‌రావు తదితరులు

**కూకట్‌పల్లి:** వివేకానందనగర్‌ డివిజన్‌ పరిధి వేంకటేశ్వరనగర్‌లోని మంజునాథ సంతోషి మాత ఆలయ పెయింటింగ్‌ పనులకు కాంగ్రెస్‌ డివిజన్‌ నాయకుడు నాయినేని చంద్రకాంత్‌ రావు విరాళం అందజేశారు. గురువారం ఆలయంలో పూజలు నిర్వహించి పనులను పరిశీలించారు. కార్యక్రమంలో లక్ష్మీ నర్సయ్య, దుర్గ ప్రసాద్‌, లక్ష్మి, కృష్ణమూర్తి, సతీష్‌, సత్యనారాయణ, యాదగిరి, రాజు, రాములు, వెంకన్న, రవి, నరేష్‌, ప్రవీణ్‌, వేణు, గోపాల్‌, లక్ష్మణ్‌ తదితరులు పాల్గొన్నారు.

## వాకర్స్‌ అసోసియేషన్‌ నూతన కార్యవర్గం



**కూకట్‌పల్లి:** కేపీహెచ్‌బీ కాలనీలోని నేతాజీ పార్కులో గురువారం కేపీహెచ్‌బీ సీనియర్‌ వాకర్స్‌ అసోసియేషన్‌ నూతన కార్యవర్గాన్ని గురువారం ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా జీజీ రెడ్డి, ఉపాధ్యక్షులుగా జేఎస్‌ఆర్‌సీ మూర్తి, సెక్రటరీగా కె. సీతారామారావు, ట్రెజరర్‌గా నరసింహా చారి, డైరెక్టర్లుగా సీహెచ్‌. శేషశయన రావు, ఎం. రమేష్‌ కుమార్‌ ఎ. జనార్దన్‌రావు, రాజమౌళి, ఎస్‌. మోహన్‌రావు, జిల్లా కోఆర్డినేటర్‌గా బి. సుదర్శనం, ఎన్నికల అబ్జర్వర్‌గా టి. సాంబయ్యలను ఎన్నుకున్నారు.

## ఐఎస్‌బీ అసిస్టెంట్‌ ప్రొఫెసర్‌కు అరుదైన గౌరవం

**‘బ్రైటెస్ట్‌ మైండ్స్‌ ఆఫ్‌ ఇండియా–2025’లో విజయసుందర్‌కు స్థానం**



**రాయదుర్గం:** ఇండియన్‌ స్కూల్‌ ఆఫ్‌ బిజినెస్‌ (ఐఎస్‌బీ) అసిస్టెంట్‌ ప్రొఫెసర్‌ ఎం విజయ సుందర్‌కు అరుదైన గౌరవం లభించింది. ‘బిజినెస్‌ మింట్‌’ ప్రకటించిన బ్రైటెస్ట్‌ మైండ్స్‌ ఆఫ్‌ ఇండియా–2025’ టాప్‌–50లో ఆయనకు స్థానం కల్పించింది. ఐఎస్‌బీలో విజయసుందర్‌ బిజినెస్‌ ప్రాసెస్‌ ఎక్స్‌లెన్స్‌, డిజిటల్‌ ట్రాన్స్‌ఫార్మేషన్‌ ఇన్‌ సర్వీసెస్‌, ప్రాజెక్ట్‌ మేనేజ్‌మెంట్‌, ఆపరేషన్స్‌ మేనేజ్‌మెంట్‌ను బోధిస్తున్నారు. పలువురు ఐఎస్‌బీ ఫ్యాకల్టీ ప్రతినిధులు, ప్రొఫెసర్లు, డీన్‌, అధికారులు విజయసుందర్‌ను అభినందించారు. భవిష్యత్‌లో మరిన్ని విజయాలు సాధించాలని సూచించారు.

# మార్చురీలోనే మమత మృతదేహం

- మృతిపై తల్లిదండ్రుల అనుమానాలు
- న్యాయం జరిగే వరకు మృతదేహాన్ని తీసుకెళ్లబోమని నిరసన
- సీసీ ఫుటేజీ విడుదల చేసిన పోలీసులు
- కంపెనీ యజమానిపై మహిళా ఉద్యోగుల ఫిర్యాదు



మమత (ఫైల్‌)

మూసాపేట: మూసాపేట మెట్రో స్టేషన్‌ వద్ద మంగళవారం రాత్రి రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన మమత మృతిపై తల్లిదండ్రులు అనుమానం వ్యక్తం చేస్తున్నారు. దీంతో మృతదేహాన్ని గాంధీ ఆసుపత్రి మార్చురీలోనే ఉంచారు. తమకు న్యాయం జరిగే వరకు మృతదేహాన్ని తీసుకెళ్లబోమని తేల్చి చెప్పారు. బుధవారం రాత్రి నుంచి గురువారం ఉదయం నుంచి కూకట్‌పల్లి పోలీస్‌ స్టేషన్‌ వద్ద మమత కుటుంబ సభ్యులు, బంధువులు పడిగాపులు కాశారు. కంపెనీ యజమానిపై చర్యలు తీసుకొని తమకు న్యాయం చేయాలని కోరుతున్నారు. గురువారం ఉదయం పోస్టుమార్టం పూర్తైందని, తల్లిదండ్రులు మృతదేహాన్ని తీసుకెళ్లకపోవడంతో మార్చురీలో భద్రపర్చినట్లు పోలీసులు తెలిపారు. మృతురాలి తండ్రి శ్రీను 8 సంవత్సరాల క్రితం అనారోగ్యంతో మృతి చెందాడు. తల్లి కుమారి పూలు అమ్ముతూ పిల్లలిద్దరినీ చదివించింది. ఆర్థిక సమస్యల కారణంగా మమత చదువును మధ్యలోనే ఆపివేసింది. అన్న చిన్న ఉద్యోగాలు చేసుకుంటూ జీవనం కొనసాగిస్తున్నారు.

### కంపెనీ యజమానిపై కేసు నమోదు

మమతతో పనిచేసే ఇతర మహిళా ఉద్యోగులు కంపెనీ యజమానిపై గురువారం ఫిర్యాదు చేశారు. మూసాపేటలోని సాయిస్ఫూర్తి ఏజెన్సీ సబ్బుల ప్యాకింగ్‌ కంపెనీ యజమాని శేషసాయి గౌడ్‌ మహిళా ఉద్యోగుల పట్ల అసభ్యంగా ప్రవర్తించేవాడని తెలిపారు. మద్యాన్ని అలవాటు చేస్తూ రాత్రిళ్లు పార్టీలకు రావాలంటూ తరచూ వేధించేవాడని ఫిర్యాదులో పేర్కొన్నారు. ఈ మేరకు కూకట్‌పల్లి పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

### లారీ ఢీకొట్టడంతోనే మృతి : ఏసీపీ

రెడిమిక్స్‌ లారీ ఢీకొట్టడంతోనే మమత మృతి చెందిందని కూకట్‌పల్లి ఏసీపీ శ్రీనివాసరావు గురువారం తెలిపారు. రోడ్డు ప్రమాదానికి సంబంధించిన సీసీ ఫుటేజీలను పోలీసులు విడుదల చేశారు. మమత పనిచేసే కంపెనీ యజమాని బాలికలకు మద్యం అలవాటు చేసి కారులో తిప్పుతున్న వీడియోలు వైరల్‌గా మారటంతో ఆ ఆరోపణలను పరిగణనలోకి తీసుకొని సమగ్ర విచారణ జరిపామని తెలిపారు. కంపెనీ యజమానిపై చర్యలు తీసుకుంటామన్నారు. అదే విధంగా బాధిత కుటుంబానికి బీజేపీ నియోజకవర్గ ఇన్‌చార్జి మాధవరం కాంతారావు, జనసేన నియోజకవర్గ ఇన్‌చార్జి ముమ్మారెడ్డి ప్రేమకుమార్‌ పరామర్శించారు. బాధిత కుటుంబానికి న్యాయం చేయాలని డిమాండ్‌ చేశారు.

## నాణ్యతా ప్రమాణాలతో పూర్తి చేయాలి



సీసీ రోడ్డు పనులను పరిశీలిస్తున్న కార్పొరేటర్‌ దొడ్ల వెంకటేష్‌గౌడ్‌ తదితరులు

**ఆల్విన్‌కాలనీ:** సీసీ రోడ్డు పనులను నాణ్యతా ప్రమాణాలతో పూర్తి చేయాలని కార్పొరేటర్‌ దొడ్ల వెంకటేష్‌గౌడ్‌ అన్నారు. ఆల్విన్‌కాలనీ డివిజన్‌ ఎల్లమ్మబండ పరిధిలోని పీజేఆర్‌ నగర్‌ కాలనీలో రూ.20 లక్షల నిధులతో నిర్మిస్తున్న సీసీ రోడ్డు నిర్మాణ పనులను గురువారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ. త్వరగా పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలన్నారు. కార్యక్రమంలో ఏఈ శ్రావణి, వర్క్స్‌ ఇన్‌స్పెక్టర్‌ రవి కుమార్‌, జి. రవి, మార్నెళ్ల శ్రీనివాసరావు, పోశెట్టి గౌడ్‌, మహేష్‌, బషీర్‌, ఖలీం, పుట్టం దేవి, రాజు, శ్రీను, కాలనీ వాసులు పాల్గొన్నారు.

## సీఎస్‌ఆర్‌ ఫౌండేషన్‌ సేవలు అభినందనీయం

- ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు



ప్రదీప్‌ చౌదరిని సన్మానిస్తున్న ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు

**కూకట్‌పల్లి:** ఫ్రీడం ఆయిల్‌ ఆధ్వర్యంలో నడుస్తున్న సీఎస్‌ఆర్‌ ఫౌండేషన్‌ సేవలు అభినందనీయమని ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు అన్నారు. గురువారం ఫ్రీడం ఆయిల్‌ కంపెనీ ఎండీ ప్రదీప్‌ చౌదరిని కలిసి సత్కరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. సీఎస్‌ఆర్‌ ఫౌండేషన్‌ ద్వారా అనేక అభివృద్ధి పనులు చేస్తున్నారని, బాలాజీనగర్‌లో సుమారు 2.5 ఎకరాలలో ఫ్రీడం పార్కును అభివృద్ధి చేశారని తెలిపారు. రెయిన్‌బో విస్టా పక్కన ఉన్న ప్రభుత్వ స్థలంలో స్కూలు ఏర్పాటు చేయాలని కోరారు. దీనికి ప్రదీప్‌ చౌదరి సానుకూలంగా స్పందిస్తూ.. నియోజకవర్గ అభివృద్ధిలో భాగస్వామ్యం అవుతామని తెలిపారు. కార్యక్రమంలో చంద్రశేఖర్‌రెడ్డి, మధుసూదన్‌రెడ్డి, శివారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## వీధి దీపాలు వెలిగేలా చర్యలు తీసుకోవాలి



కార్పొరేటర్‌ సబిహా బేగంకు వినతిపత్రం అందజేస్తున్న విజయకుమార్‌ గౌడ్‌ తదితరులు

మోతీనగర్‌: అల్లాపూర్‌ డివిజన్‌ పరిధిలోని శివాజీ నగర్‌లో ప్రధాన వీధుల్లో వీధి దీపాలు వెలిగేలా చర్యలు తీసుకోవాలని సంక్షేమ సంఘం నాయకులు కోరారు. ఈ మేరకు గురువారం కార్పొరేటర్‌ సబిహా బేగంకు శివాజీ నగర్‌ సంక్షేమ సంఘం అధ్యక్షులు విజయకుమార్‌ గౌడ్‌ వార్డు కార్యాలయంలో కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కొన్ని నెలల నుంచి వీధి కుక్కలతో బయటకు రావాలన్నా భయపడాల్సిన పరిస్థితి నెలకొందన్నారు. రాత్రి వేళల్లో వీధి దీపాలు వెలిగేలా చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ ప్రాంతంలో ట్రాఫిక్‌ ఎక్కువగా ఉండటంతో చీకట్లో ఎక్కడ ప్రమాదాలు జరుగుతాయోనని ఆందోళన చెందుతున్నామన్నారు.

## దరఖాస్తుల ఆహ్వానం

**రాయదుర్గం:** మౌలానా ఆజాద్‌ జాతీయ ఉర్దూ విశ్వవిద్యాలయంలో స్పాన్సర్డ్‌/సెల్ఫ్‌ ఫైనాన్సింగ్‌ మోడ్‌లో పార్ట్‌టైమ్‌ పీహెచ్‌డీ కోర్సులలో అడ్మిషన్లు పొందేందుకు ఆన్‌లైన్‌ ద్వారా దరఖాస్తులను కోరుతున్నట్లు ‘మనూ’ అడ్మిషన్స్‌ డైరెక్టరేట్‌ డైరెక్టర్‌ ప్రొఫెసర్‌ ఎం వనజ గురువారం తెలిపారు. దరఖాస్తుల సమర్పణకు ఫిబ్రవరి 17 ఆఖరుగా అని పేర్కొన్నారు. యూనివర్సిటీలోని స్కూల్‌ ఆఫ్‌ కామర్స్‌ అండ్‌ బిజినెస్‌ మేనేజ్‌మెంట్‌, స్కూల్‌ ఆఫ్‌ టెక్నాలజీ, స్కూల్‌ ఆఫ్‌ సైన్సెస్‌, స్కూల్‌ ఆఫ్‌ ఎడ్యుకేషన్‌ అండ్‌ ట్రైనింగ్‌, స్కూల్‌ ఆఫ్‌ మాస్‌ కమ్యూనికేషన్‌ అండ్‌ జర్నలిజం, స్కూల్‌ ఆఫ్‌ ఆర్ట్స్‌ అండ్‌ సోషల్‌ సైన్సెస్‌లో అడ్మిషన్లు కల్పిస్తామని వివరించారు. దరఖాస్తు ఫారం, ఇతర వివరాలు యూనివర్సిటీ వెబ్‌సైట్‌లో ఉన్నాయన్నారు. మరిన్ని వివరాలకు ఫోన్‌ నెంబర్‌: 6207728673, సాధారణ వివరాలకు: 9866802414, స్కూల్‌ ఆఫ్‌ టెక్నాలజీ, సైన్సెస్‌, కామర్స్‌, బిజినెస్‌ మేనేజ్‌మెంట్‌: 9177461590, స్కూల్‌ ఆఫ్‌ ఆర్ట్స్‌ అండ్‌ సోషల్‌ సైన్సెస్‌, మాస్‌ కమ్యూనికేషన్‌ అండ్‌ జర్నలిజమ్‌ 8374346948లో సంప్రదించాలని సూచించారు.

## అదనపు తరగతుల నిర్మాణానికి స్థలం కేటాయింపు

**నిజాంపేట్‌ :** బాచుపల్లి ప్రభుత్వ పాఠశాలలో అదనపు తరగతుల నిర్మాణం కోసం ప్రభుత్వ స్థలం కేటాయించేందుకు గురువారం రెవెన్యూ అధికారులు సర్వే నిర్వహించారు. స్కూల్‌ పక్కనే జలమండలికి ఒక ఎకరం స్థలం కేటాయించారు. జలమండలి ఆధీనంలో ఎకరం స్థలం కంటే ఎక్కువ ఉందని, ఆ స్థలాన్ని పాఠశాల అదనపు తరగతుల కోసం వినియోగించాలని హెచ్‌ఎం రామకృష్ణ తదితరులు జిల్లా అధికారులను పలుమార్లు కోరారు. దీంతో స్పందించిన అధికారులు తహసీల్దార్‌, జలమండలి అధికారులు, ఎంఈఓ సమక్షంలో సర్వే చేశారు. పాఠశాల అదనపు గదుల నిర్మాణం కోసం సుమారు రూ.25 లక్షల సీఎస్‌ఆర్‌ నిధులు మంజూరయ్యాయి.

## రక్తదాన శిబిరాల ఏర్పాటు అభినందనీయం




రక్తదాన శిబిరంలో పాల్గొన్న ఏసీపీ హనుమంత్‌రావు

**జగద్గిరిగుట్ట:** సమాజ శ్రేయస్సు కోసం రక్తదాన శిబిరాలు ఏర్పాటు చేయడం అభినందనీయమని బాలానగర్‌ ఏసీపీ హనుమంత్‌రావు అన్నారు. సైబర్‌ బాధితుల ఫౌండేషన్‌ ప్రెసిడెంట్‌ గుల్ల నాగరాజు, వ్యవస్థాపకులు పులి అరవింద్‌ కుమార్‌ ఆధ్వర్యంలో గురువారం జగద్గిరిగుట్ట బస్టాప్‌ సమీపంలో దుర్గమ్మ ఆలయ సమీపంలో రక్తదాన శిబిరం నిర్వహించారు. సుమారు 55 మంది రక్తదానం చేశారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరై ఆయన మాట్లాడారు. ఇలాంటి శిబిరాలను మరిన్ని నిర్వహించాలన్నారు. కార్యక్రమంలో జగద్గిరిగుట్ట సీఐ నర్సింహ, ఎస్‌ఐలు రాజేష్‌, రంజిత్‌, అబ్దుల్‌ హయ్యూం, గుల్ల కల్పన, న్యాయవాది శ్వేత, సాయి సేవా సమితి అధ్యక్షురాలు యద్రం శాంతి గుప్తా, రాజు, వెంకటేష్‌, సోమాగోని శృతి, జాన్వేష్‌, వంశీ, అరవింద్‌, భాగ్య, సిరి, మానస, దివ్య పాల్గొన్నారు.

## బంగారం, వెండి వస్తువులు ఎండోమెంట్‌కు అప్పగింత



ఆభరణాలను ఎండోమెంట్‌ అధికారులకు అప్పగిస్తున్న ఎమ్మెల్యే కృష్ణారావు తదితరులు

**కూకట్‌పల్లి:** కూకట్‌పల్లి సీతారామచంద్రస్వామి దేవస్థానంలో దాతలు ఇచ్చిన బంగారం, వెండి ఆభరణాలు, వస్తువులను గురువారం అందరి సమక్షంలో ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు ఎండోమెంట్‌ అధికారులకు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సుమారు 637 గ్రాముల బంగారం, 500 గ్రాముల వెండి వస్తువులను ఎండోమెంట్‌ వారికి అప్పగించినట్లు తెలిపారు. అదే విధంగా రామాలయం పక్కన ఉన్న స్థలం యజమానులతో మాట్లాడి బ్రాహ్మణుల నివాసానికి, వంటశాల ఏర్పాటుకు ఆలోచిస్తున్నామని తెలిపారు. 20 అడుగుల ఆంజనేయ స్వామి విగ్రహ ఏర్పాటుకు శిల్పుల నుంచి డ్రాయింగ్స్‌ తెప్పించామన్నారు. ఆలయానికి వచ్చే భక్తులకు అన్ని సౌకర్యాలు కల్పించాలని ఈవో సూచించారు. కార్యక్రమంలో కార్పొరేటర్‌ జూపల్లి సత్యనారాయణ, తుల సీరామ్‌, సూర్యారావు, ఆలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

## సమస్యల పరిష్కారానికి ఎల్లవేళలా కృషి

ఎమ్మెల్సీ శంభీపూర్‌ రాజు

**దుండిగల్‌:** ప్రజా సమస్యల పరిష్కారమే ధ్యేయంగా పని చేస్తున్నానని ఎమ్మెల్సీ శంభీపూర్‌ రాజు అన్నారు. దుండిగల్‌ మున్సిపాలిటీ శంభీపూర్‌లోని కార్యాలయంలో గురువారం నాయకులు, కార్యకర్తలు ఆయనను కలిసి వివిధ సమస్యలు పరిష్కరించాలని వినతిపత్రాలు అందజేశారు. దీనిపై సానుకూలంగా స్పందించిన ఆయన.. సంబంధిత అధికారులతో మాట్లాడి సమస్యలను పరిష్కరిస్తానని హామీ ఇచ్చారు. అదే విధంగా వేడుకలు, జాతర సందర్భంగా ఆహ్వాన పత్రికలను అందజేశారు.



# చందానగర్‌ ఎంఎంటీఎస్‌..
# సమస్యలెన్నో



రైలుపట్టాలు దాటుతున్న ప్రజలు

**రైల్వే స్టేషన్‌లో వసతులు కరువు**

- ఎఫ్‌ఓబీ ఉన్నా ఎక్కలేక పట్టాలు దాటుతున్న ప్రయాణికులు, కాలనీలవాసులు
- ప్రమాదాలు జరుగుతున్నాయ్‌.. లిఫ్టులు ఏర్పాటు చేయాలని వినతి



కంకర తేలిన రైల్వేస్టేషన్‌ రోడ్డు

**చందానగర్‌:** చందానగర్‌ ఎంఎంటీఎస్‌ రైల్వే స్టేషన్‌లో సమస్యలు రాజ్యమేలుతున్నాయి. నగరంలో ఎంఎంటీఎస్‌ సర్వీస్‌లు ప్రారంభం అయినప్పటి నుంచి లింగంపల్లి నుంచి హైదరాబాద్‌, ఫలక్‌నుమా వరకు రైల్వే స్టేషన్లు అభివృద్ధి చెందాయి. కానీ చందానగర్‌ ఎంఎంటీఎస్‌ రైల్వే స్టేషన్‌లో వాహనాల పార్కింగ్‌ స్థలం, రైల్వే స్టేషన్‌ ఎదురు రోడ్డుపై చెత్త చెదారం వేస్తున్నారు. పార్కింగ్‌ స్థలంలో ప్రైవేట్‌ స్కూల్‌ బస్సులు పార్క్‌ చేస్తుండడంతో స్టేషన్‌కు వచ్చే ప్రయాణికులు ఇబ్బందులు పడుతున్నారు. స్టేషన్‌ ముందు ఉన్న బస్‌షెల్టర్‌ పూర్తిగా శిథిలావస్థకు చేరింది. స్టేషన్‌లో మంచినీటి కుళాయిలు, మరుగుదొడ్లు అపరిశుభ్రంగా ఉన్నాయి. రైల్వే స్టేషన్‌ సమీపంలో నిత్యం ప్రమాదాలు చోటుచేసుకుంటున్నాయి. పాపిరెడ్డి కాలనీ, చందానగర్‌ వైపు వెళ్లాలంటే ఫుట్‌ఓవర్‌ బ్రిడ్జి ఉన్నా ఎక్కలేక ప్రజలు పట్టాలు దాటుతూ ప్రమాదాల బారిన పడుతున్నారు. వృద్ధులు, మహిళల కోసం లిఫ్టులు ఏర్పాటు చేయాలని ప్రజలు కోరుతున్నారు. కాగా రైల్వే స్టేషన్‌ వద్ద పార్కింగ్‌ స్థలంలో వాహనాల పార్కింగ్‌ కోసం షెడ్డును నిర్మించాలి. బస్‌ షెల్టర్‌ ముందు చిరువ్యాపారుల దుకాణాలను తొలగించి బస్సులు, ఆటోలు నిలబడే విధంగా అధికారులు చర్యలు తీసుకోవాలి. అలాగే వివిధ కాలనీలవాసులు రైల్వే ట్రాక్‌ దాటకుండా ఫెన్సింగ్‌ ఏర్పాటు చేయాలని ప్రజలు కోరుతున్నారు.

### ఇబ్బందులివే

- చందానగర్‌ రైల్వేస్టేషన్‌ ఇరువైపులా ప్లాట్‌ఫారాలకు వెళ్లాలంటే ఫుట్‌ఓవర్‌ బ్రిడ్జి ఉంది. వృద్ధులు, వికలాంగులు ఎక్కలేక ఇబ్బందులు పడుతున్నారు.
- రైల్వే స్టేషన్‌ ముందు రోడ్డు కంకర తేలడంతో ద్విచక్ర వాహనదారులు భయపడుతున్నారు. రోడ్డు పూర్తిగా గుంతలు పడింది
- వాహనాల పార్కింగ్‌ స్థలంలో షెడ్డు లేకపోవడంతో ఎండలోనే వాహనాలు నిలుపుతున్నారు.
- ప్రధాన ద్వారం ముందు ప్రైవేట్‌ వాహనాల పార్కింగ్‌తో ప్రయాణికులు ఇబ్బంది పడుతున్నారు
- బస్‌ షెల్టర్‌ ముందు దుకాణాల ఏర్పాటుతో సమస్యలు నెలకొన్నాయి
- వాహనాల పార్కింగ్‌ వద్ద పిచ్చిమొక్కలు పెరగడంతో ఆ ప్రాంతమంతా అపరిశుభ్రంగా మారింది.
- రైలుపట్టాల వద్ద బారికేడ్లు లేకపోవడంతో ప్రయాణికులు పట్టాలు దాటుతున్న క్రమంలో ప్రమాదాలు జరుగుతున్నాయి.
- రైల్వేస్టేషన్‌లో వృద్ధులు, వికలాంగుల కోసం ఫుట్‌ ఓవర్‌ బ్రిడ్జికి లిఫ్టులు ఏర్పాటు చేయాలి.




చందానగర్‌ ఎంఎంటీఎస్‌ రైల్వేస్టేషన్‌ ప్రధాన ద్వారం



రైల్వేస్టేషన్‌ ఎదుట స్కూల్‌ బస్సులు పార్క్‌ చేసిన దృశ్యం


### రైల్వే స్టేషన్‌లో లిఫ్టులు ఏర్పాటు చేయాలి



చందానగర్‌ ఎంఎంటీఎస్‌ రైల్వే స్టేషన్‌లో ప్రతి రోజు వేలాదిమంది ప్రయాణికులు రాకపోకలు చేస్తుంటారు. ప్లాట్‌ఫారాలు మారాలంటే వృద్ధులు, మహిళలు, వికలాంగులు ఇబ్బందిపడుతున్నారు. ఫుట్‌ఓవర్‌ బ్రిడ్జికి లిఫ్టులు ఏర్పాటు చేయాలని రైల్వే అధికారులకు వినతిపత్రం ఇచ్చాము. ఇప్పటికైనా అధికారులు తగు చర్యలు తీసుకోవాలి.

–సుభాష్‌, చందానగర్‌

### అక్రమ పార్కింగ్‌పై చర్యలు తీసుకోవాలి



చందానగర్‌ రైల్వే స్టేషన్‌ పార్కింగ్‌ స్థలంలో కొంతమంది స్కూల్‌ బస్సులు పార్కు చేస్తుండడంతో ప్రయాణికులు తమ వాహనాలు పెట్టడానికి ఇబ్బందులు పడుతున్నారు. ఇప్పటికైనా రైల్వే అధికారులు చర్యలు తీసుకోవాలి.

–విజయ్‌కుమార్‌, పాపిరెడ్డి కాలనీ

## బాచుపల్లి ఎస్‌ఆర్‌ కాలేజీకి ఇంటర్‌ బోర్డు నోటీసులు

విద్యార్థిని పూజిత మృతిపై పూర్తి నివేదిక ఇవ్వాలని ఆదేశం

**నిజాంపేట్‌:** బాచుపల్లిలోని ఎస్‌ఆర్‌ బాలికల జూనియర్‌ కాలేజీకి ఇంటర్‌ బోర్డు అధికారులు గురువారం షోకాజ్‌ నోటీసులు జారీ చేశారు. బుధవారం ఉదయం ఇంటర్‌ సెంకడ్‌ ఇయర్‌ చదివే పూజిత(17)అనే విద్యార్థిని ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకుంది. ఈ నేపథ్యంలో కాలేజీ యాజమాన్యం తమకు తప్పుడు సమాచారం ఇచ్చారని విద్యార్థిని తల్లిదండ్రులు ఆరోపించారు. మొదట బాత్‌రూంలో జారీ పడిందని, తరువాత మృతి చెందిందని చెప్పి గాంధీ ఆసుపత్రికి రావాలని చెప్పడంతో తల్లిదండ్రులు తీవ్ర ఆందోళనకు గురయ్యారు. కాలేజీ యాజమాన్యం చేసిన తీవ్ర మానసిక ఒత్తిడితోనే తమ కూతురు మృతి చెందిందని తల్లిదండ్రులు దేవి, శ్రీనివాస్‌లు పోలీసులకు ఫిర్యాదు చేశారు. కళాశాల ఎదుట ఆందోళనకు దిగారు. ఈ నేపథ్యంలో స్పందించిన మేడ్చల్‌ జిల్లా ఇంటర్‌ బోర్డు అధికారి కిషన్‌ కాలేజీకి విద్యార్థిని మృతిపై నివేదిక ఇవ్వాలని నోటీసులు జారీ చేశారు.

## ప్రధాన రోడ్లకు మరమ్మతులు చేయరా?

- గుంతలతో పొంచి ఉన్న ప్రమాదం
- పట్టించుకోని అధికారులు



నిజాంపేట్‌లో ప్రధాన రోడ్డులో ..

**నిజాంపేట్‌ :** ప్రధాన రోడ్లు మరమ్మతులకు నోచుకోవడం లేదు. రోడ్లపై గుంతలు ఏర్పడటంతో వాహనదారులకు తీవ్ర ఇబ్బందులు ఎదురవుతున్నాయి. నెలల తరబడి రోడ్లపై ఉన్న గుంతలకు పూర్తి స్థాయిలో మరమ్మతులు చేయడంలో అధికారులు విఫలమవుతున్నారు. నిజాంపేట్‌ నుంచి బాచుపల్లి వైపు వెళ్లే రోడ్డుపై జీఎస్‌ వైన్స్‌ సమీపంలో రోడ్డుపై ఏర్పడిన గుంతలను మరమ్మతులు చేయలేక ట్రాఫిక్‌ నియంత్రణకు ఉపయోగించే బారికేడ్‌ను సూచికగా ఏర్పాటు చేశారు. వాటర్‌ వర్క్స్‌ విభాగం అధికారులు పైప్‌లైన్‌ పనుల కోసం రోడ్డును తవ్వి పనులు పూర్తి చేసిన తరువాత గుంతలను అలాగే వదిలేశారు. ఈ గుంతలో వాహనదారులు పడకుండా ఉండేందుకు ట్రాఫిక్‌ పోలీసులు బారికేడ్‌ను ఏర్పాటు చేశారు. అదే విధంగా బాచుపల్లి నుంచి గండి మైసమ్మ చౌరస్తా వైపు వెళ్లే రోడ్డులో బాచుపల్లి వద్ద పైపులైన్‌ పనులు పూర్తి చేసి గుంతలను వదిలేశారు. ఇలా అధికారుల నిర్లక్ష్యంతో వాహనదారులు ప్రమాదాలకు గురవుతున్నారు. ఇప్పటికైన అధికారులు స్పందించి వెంటనే రోడ్ల మరమ్మతులు పూర్తి చేసి ప్రమాదాలను నివారించాలని వాహనదారులు కోరుతున్నారు.